కథానిక:

తారాబలం

శ్రీ వెంపటి సచ్చిదానందశర్మ

నక్షత్ర మండలాన్నుంచి ఆచుక్క "మహాఁ... పోతానంటావు, ఎక్కడికి? గట్టిగామాట్లాడితే, నీకు 'నా' అనే వాళ్ళెవళ్ళన్నా ఉన్నారూ?" అని నిలవేసి అడిగితే, ఈ చంద్రుడు సమయస్ఫూర్తి కోసమన్నా కొంచెంఢాలు ఫిరాయించి నీ లెఖ్ఖేమిటి? మాపట్టు మేరంతా—నా—వాడే"—అని ఉండాల్సింది.

ఇంతకీ, ఘనమనే, శ్రీలేఖ, అలా అననూ లేదు; ఆమె అలా అనకపోయినా తనీమాటలు అని ఉండాల్సిందన్న విషయం వెట్టివెంక్రటావుకి స్ఫురించనూ లేదు. ఇది తెల్సుకున్నప్పుడల్లా హరినారాయణ పొట్ట చేత్తో పుచ్చుకుని ఎద్దేవాకి పడతాడు. అంతే కాదు— మీరుకనిపించారంటే చాలు, ఈ కథంతా మళ్ళీ ఒకసారి తిరిగెయ్యందే వాణ్ణి మీరు వదుల్చుకోలేరు.

ఈ రసాభాసకోసమన్నట్టు, గతసోమవారం సంజచీకట్లో పార్కులో ఒక బెంచీ తనదిచేసుకుని వెన్నువాల్చాడు వెంకట్రావు. ప్రక్కనున్న హోటలు రోజూ పెట్టే పిడికెడన్నంతోపాటు హరివాసరముంచి బలవంతానరవ్వంత పుణ్యమంటగట్టింది. రేడియో వదుల్తున్న విషాదగీతం వెంకట్రావు గూబలకి వడగాలిలాగా తగుల్తోంది. తనకు స్వతస్సిద్ధమైన కూనిరాగం కూడా తీసే ఓపికలేని వెంకట్రావు సిగరెట్టు కోసమని జేబు తడుముకుంటున్నాడు పడుకునే. దాని అంతుదొరక్క, అప్పుడేకొన్న పెట్టెడు సిగరెట్లూ ఎటు మాయమయినయ్యాని కలవరపడుతున్న సమయంలో బల్లకిందినించి పెట్టె తీసి అందిస్తూ హరినారాయణ చాలా నాటకోచితంగా ప్రత్యక్షమయాడు.

తనాస్థితిలో హరినారాయణ్ణి ఎదుర్కోవలసి వచ్చేసరికి ఎక్కడలేని లజ్జఅనిపించింది వెంట్రావుకి. ఒక విధంగా కోపంకూడా వచ్చింది వాడిమీద. తను— ఇదిచేస్తున్నాను అని చెప్పగల సమయం వచ్చేదాకా—మన అన్న వాళ్ళకళ్ళ పడకూడదని వెంకట్రావు తప్పుకు, తప్పుకు తిరుగుతున్నాడు.

అందులోనూ— హరినారాయణ ఠీకుగా గుప్పుమని సెంటు పొగలుగక్కుతున్నాడు! వెంకట్రావుకి వెక్కిరించి నట్లయింది. "ఇక్కడి కెలావచ్చావురా! నేనిక్కడున్నట్టు నీ కెలా తెలిసింది?" అన్నాడు తడబడుతూ.

వెంకట్రావడిగిన మొదటి ప్రశ్నకి సమాధానం చెప్పకండా "నీ శ్రేయోభిలాష ఆపాటి మాకుండాలే గాని నువ్వెక్కడుండీ కనుక్కోలేక పోతామా?" అన్నాడు— హరినారాయణ ఈ మధ్య తననితాను బహువచనంలో తప్పితే సంబోధించుకోవటం లేదని వెంకట్రావు తరవాత, తరవాత గ్రహించాడు.

వెంకట్రావలాగే ముణగదీసుకూర్చునేసరికి "భోజనాది కాలయ్యాయా?" అన్నాడు హరినారాయణ.

"ఊఁ..." ఆకలికడుపుతో మూలిగాడు వెంకట్రావు.

"మరినిద్రెక్కడ?"

వెంకట్రావుకి వళ్ళుమండింది. హరినారాయణ తన్నిలా ఎందుకు బాధపెడతాడు? "ఎక్కడైనా కావచ్చు!" అన్నాడు ఫెళ్ళున.

"అంటే?"

"అంటే... ఈ బెంచీమీదన్నా కావచ్చు; ఆపాకలో నన్నా కావచ్చు!" తిక్క కుదిరిందనుకున్నాడు వెంకట్రావు.

"పోనీ, ఆ మేడలోనన్నా కావచ్చుగా?" అన్నాడు హరినారాయణ మళ్ళీ.

"ఐతే కానూవచ్చు" అన్నాడు వెంకట్రావు అటువైపుచూసి.

"మరైతే పోదాంపద... ఈ చలి రోజుల్లో— జలుబు లంకించుకుంటే ఓపట్టానవదల్దురా, నాతండ్రీ! అసలే ముసముసలాడుతూ ఉంటావు" హరినారాయణ తన్ని ఎత్తిచంకనేసుకుంటాడేమోననిపించింది వెంకట్రావుకి. ఊళ్ళో ఉండగా నాటకం కంపెనీలని లేవదీసి తను-చెడి ఇతర్లని చెడగొట్టినం

దుకు హరినారాయణకి కొద్దిపాటి అభినయం అబ్బింది. ఫరవాలేదని సంతోషించాడు వెంకట్రావు.

తరవాత హరినారాయణ ఎంతసేపు మాట్లాడినా వెంకట్రావుని ఆ మేడలోకిపోయి నిద్రపోదాం రమ్మంటాడు! వాడి తరహా చూస్తే మహా చిరాకనిపించింది వెంకట్రావుకి. నవ్వులాటకేదైనా అంటే, అది నవ్వులాటకంటున్న సూచన, దానికొక హద్దూ పద్దూ ఉంటుంది. విని, విని తలనొప్పొచ్చి, "ఆ మేడెవరిదో కనీసం తెలియనన్నా తెలుసా, నీకు?" అన్నాడు వెంకట్రావు.

"ఎవరిదైతే మనకేం ... వెళ్లి, ముందు మనమెవళ్లమో తెలియజెప్పుకుందాం" అన్నాడు వాడి సహజమైన తలతిక్క ధోరణిలో.

"ఏమని?" అన్నాడు వెంకట్రావు విసుగ్గా.

"శేర్వాణీ వేసి, అభ్యాగతులమని!"

ఇంకా హరినారాయణతో మాట్లాడట మల్లా వాణ్ణింకా రెచ్చగొట్టటమే కాని మరేమీ ప్రయోజనముండదనుకున్నాడు వెంకట్రావు. తలతిక్క సంభాషణలు చెయ్యటంలో హరినారాయణ అప్పుడూ ఇప్పుడూ కూడా ఒకేమాదిరిగా ఉన్నాడని కూడా అనుకున్నాడు వెంకట్రావు. ఆ మేడ, తారామణి—ముక్కోటి ఆంధ్రుల ముద్దుగుమ్మ—శ్రీలేఖదని హరినారాయణకి మాత్రం తెలీదని వెంకట్రావు ఎలా అనుకుంటాడు? నిజానికి, ఆ మేడలోకి ప్రవేశం ఎలా దొరుకుతుందా అని తనింతవరకు పడిగాపులు పడి ఉన్నానన్న విషయంకూడా జ్ఞప్తికి వచ్చింది వెంకట్రావుకి.

"అబ్బ! లేరా...పోదాం" అన్నాడు మళ్లీ హరినారాయణ ఆవలించి, మత్తుగా, విసుగ్గా.

"ఎక్కడికిరా?" ఒక్క అరుపు అరిచాడు వెంకట్రావు. మళ్లీ ఒకక్షణం తరవాత "ఆ మేడెవరిదో నీకేమన్నా తెలుసా!" అన్నాడు తనకి తెలుసునన్నట్టు:

"ఎవరిది?" అన్నాడు హరినారాయణ తనకి తెలీదన్నట్టు.

"శ్రీలేఖది!"

"శ్రీలేఖ ఎవరో తెలుసా?"

"మన ధనం!"

ఇలా—సందేహ నివృత్తిచెయ్యి, మహాశయా!—అన్నట్టు పెద్దరిక మిచ్చి హరినారాయణ్ణి కూర్చోపెట్టాలేగాని, ఏవిషయాన్ని గురించిన పుట్టు పూర్వోత్తరాలైనా బైటికీడ్చి కాని ఊరుకోడు. "ఇహ మనకి దిగులేలేదు. చెప్పుల్లో కాళ్లుపెట్టు! నీసంగీత మేదో అక్కరకొచ్చే ఘడియొచ్చింది. నాకు తెలుసు పుంజుకూత కెక్కుతుందని..." ఇలా ఒకే విషయాన్ని విపరీతమైన ఫక్కీలో అదేపనిగా చెప్పటం మొదలుపెట్టేసరికి హరినారాయణ మంచితనాన్ని గురించి వెంకట్రావుకోలక్ష కుశ్శంకలు బయలుదేరాయి.

"నేను రాను" అని, వెంటనే, మళ్లీ హరినారాయణ అడ్డదిడ్డ ప్రశ్నలకి ఆస్కారంలేకుండా, "ఒరే, అబ్బీ! నిజం చెపుతున్నాను—నాకు సంగీతంలో మంచి ప్రవేశం ఉంది. మీ సినిమాల్లో నాకేదన్నా రవ్వంత అవకాశ మిప్పించమ్మా—అని అడుగుదామనే తంటాలు పడుతున్నాను...నువ్వు నన్ను వదిలెయ్యి, నీకు పుణ్యముంటుంది" అన్నాడు వెంకట్రావు.

"అఁహ మళ్లీ అదేమ్మాట!... మరిన్ని ఊహలు కడుపులో పెట్టుకుని ఇక్కడ పడుకుంటే ఏంలాభం చెప్పు, మేడలోంచి వచ్చేపోయే వాళ్లని లెక్కపెడుతూ. వెఱ్ఱి నాయనా లే! నేనావిణ్ణెరుగున్నాను, నీకు పరిచయం చేస్తాను, పద..." అన్నాడు హరినారాయణ ఒక్కగుక్కలో.

"నీ పరిచయానికీ, నీకూ పదివేల నమస్కారాలు ఆవిడ మన ఊరునుంచి లేచి వచ్చినప్పుడు మనకు జరిగిన రాద్ధాంతమంతా ఆ విడకుండు తిరగతోడకుండాఉంటేవా, అదే పదివేలు!" అన్నాడు వెంకట్రావు, ఒకరకంగా ప్రాధేయ పడుతున్నట్టు.

"ఎంతమాట! నడు... ఇలా మనవాడు, మంచి సంగీత విద్వత్తుంది. సినిమా ఉద్యోగంకోసం వచ్చాడు అని చెప్పటంకంటె, నోరెత్తితే నాలిక తెగ్గొయ్యి!" అన్నాడు నమ్మమన్నట్టు.

వెంకట్రావుకూడా నమ్మక తప్పింది కాదు. ఇద్దరూ గేటుదాటి లోపలికి నడుస్తున్నారు. పోర్టికోలో కారు వేచివుంది. వాళ్ళిద్దరూ లోపలికి ప్రవేశించేసరికి హాండ్‌బ్యాగ్ గిరగిరా తిప్పుకుంటూ గుమ్మంమెట్లు రెండు గెంతుల్లోదిగి, ముందుచూసుకోకుండానే వాళ్ళిద్దర్నీ తాకే అంతదగ్గర్లోకి చరచరా వచ్చి కళ్ళెత్తి, ఆగి, నాలుగడుగులు వెనక్కి వేసి, "హల్లో! నమస్తే! రండి..." క్షణంపాటు నమస్కారముద్రపట్టి, టీ పాయ్‌చుట్టూ ఉన్నకుర్చీలు చూపించింది, శ్రీలేఖ.

హరినారాయణ మాట్లాడబోతుండగానే, "రంగయ్యా... ఇప్పుడు సినిమాకివెళ్ళను. కారు షెడ్డులోపెట్టెయ్...వడితే తరవాత షోకివెడతాను!" అంది తనుకూడా కుర్చీలో జార్లపడుతూ.

సినిమాకి పోదామని అలా అలంకరించుకున్న ఆమెనుచూసి పరిసరాల మార్పుతో మనిషి తరహాలో ఇంత మార్పురావటానికి అవకాశముందా అని వెంకట్రావు తబ్బిబ్బవుతున్నాడు. కష్టమైనా, ఇష్టంలేక

పోయినా నువ్వీ కాపరం వెళ్ళబెట్టాలిసిందే— అని శపించినట్టు నిర్దేశించబడ్డ ఒక స్త్రీ— తిరగబడి ఇంత దయిందంటే ఒక విధంగా మెచ్చుకోకుండా వెంకట్రావుండలేక పోయాడు. మళ్ళీ వెంటనే, ఈ విడిలా లేచిరావటంలో తనకు లేనిపోని పాత్రఅంట గట్టినందుకు హరినారాయణతో బాటు ఈవిణ్ణికూడా తను తిట్టిన తిట్లన్నీ కూడా జ్ఞాపకంవచ్చినై.

ఇంతలో, హరినారాయణ శ్రీలేఖతో, "ఇతను నాస్నేహితుడు— వెంకట్రావని... మన ఊరి వాడే..." అంటూ ఇంకాతన సంగీతప్రావీణ్యాన్ని గురించి చెప్పకముందే పక్కున కిలకిలానవ్వి, అప్పుడే తెలుసుకున్నట్టు, "ఎవరికి? నాకేనా మీపరిచయ వాక్యాలు! ఇంకానయం! నేనే మీకాయన్ని పరిచయంచేస్తాను పట్టండి... వెంకట్రావుగారి ఆసరా వల్ల నేగాదండీ.... నేను మాయింటి నరకంనించి బయటపడింది!" అంది అతనివైపు ఓరచూపులు చూసి ముసి ముసి నవ్వులు నవ్వుతూ,

వెంకట్రావు ఒక్కసారి ఉక్కిరిబిక్కిరయ్యాడు. నిజానికి, ఆమెతో తనకిదే మొదటి పరిచయం. అయినా, వెనక హరినారాయణ పుకారుపుట్టించినట్టు, తనని లేవదీసుకు వచ్చింది నువ్వేనంటోంది వెంకట్రావుని... తనేదో పద్మవ్యూహంలో చిక్కుకున్నట్టనిపించింది వెంకట్రావుకి. శ్రీలేఖ హరినారాయణకన్న వెకిలి మనిషి అనుకున్నాడు వెంకట్రావు.

"నాకు తెలీదుట్రా నీ సంగతి! లేని పోనిది పుట్టించానని పీక్కు తింటివే? పోనీ, చేసిందేదో మంచిపనే చేశావు!" అంటూ హరినారాయణ తీరిగ్గా అందుకున్నాడు.

"మనిషి విలువ తెలుసుకోలేనిచోట బతకటంకంటె చావటం చాలా మంచిది. అంతధైర్యంలేనప్పుడు ఎక్కడికైనా తనదారితాను చూసుకోవటం మంచిది... నాకు తరవాత తెలిసిందిలెండి, నేవచ్చేశాక వాళ్ళెంత విచారపడ్డదీని...." శ్రీలేఖ, ఈసో్వత్కర్ష,బి నేసరికి వెంకట్రావుకు ఒళ్ళుమండింది. ఆవిడ ఇంటిదగ్గిరపడ్డ కష్టాలేమిటో నిజంగాతనకిప్పటికీ తెలియావు.

వెంకట్రావు ఎంతవద్దనుకుంటున్నా కథ మాత్రం వెనక్కి జరిగింది—

ఒకనాడు కంపెనీకొట్లో కూర్చుని నాటకం రిహార్సలుకి ముందు అంతా పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.

"ఈ ఆడవేషాలతో వచ్చే చిక్కు ఇంతా అంతా కాదు. అసలు రిహార్సల్సుకి రావటమే అరుదు ...ఒకవేళ రావాలనుకున్నా...రత్నమ్మ చీర సింగారించే సరికి పట్నంమాటుమణుగుతుంది..." కుర్చీలో కూర్చున్న పోజుతో బాటు గడ్డంకింద పోటీపెట్టిన చేతిని కూడా మార్చాడు ఆర్గనైజర్— హరో హరి నారాయణ.

"నెలబత్యాలింకా ముట్టలేదని ఆ రాధమ్మ ఏమన్నా అలిగిందేమో ఖర్మం?" కసితీరా అన్నాననుకున్నాడు, మొగవేషాల నేసరికి జీతం బత్యం అవసరం లేని వెట్టివాళ్లుగా భావిస్తారని గుబ్బుగా ఉన్న నారద వేషధారి.

ఈమాటతో హరినారాయణ స్టేజీ కృష్ణుడిపోజులోనే చూశాడు కాని, డబ్బువిషయం గనక తను నోరెత్తి లాభంలేదని ఊరుకున్నాడు.—

"రేపీపాటికల్లా తిప్పి మొహానకొడతామని చెప్పు...వెధవడబ్బు! కొత్త దానికంత గడ్డితింటుందేమిట్రా..." పక్కఇంట్లోనుంచి ఏడుపులు వినబడుతూ ఉండేసరికి ఇంకా ఏదో అనబోయినవాడు కాస్తా అలాగే ఉండిపోయాడు, ప్రస్తుతం తులాభారం నాటకాన్ని తెరవెనక తూస్తున్న వెంకట్రామయ్య.

హరినారాయణ మినహాగా అంతా మిడిగుడ్లు పెట్టి చెవులు రిక్కించి క్షణంసేపు నిశ్శబ్దంగా ఉన్నారు. హరినారాయణ మాత్రం ఈక్షణంసేపూ గలభాకి కారణమేమిటో దివ్యదృష్టితో చూస్తున్నట్లు తనకి సహజమైన పోజుపట్టి, "వాళ్లధనం పోయిందట..." అన్నాడు మామూలుగా.

"ఛా! పట్టపగలే!... నడిరోడ్డుమీద కొంప!" అన్నాడు వెంకట్రామయ్య నిర్ఘాంతపోయి.

"ఎంతలోకేమిటి? ఇలాటి వస్తువిక్కడున్నదని జాలు అందాలేగాని, ఎవరైనా ఎగరతన్నుకుపోతారు. ఆతల్లి ముందేమో "అబ్బాయ్! ధనముందిరా అక్కడ?" అని నెత్తినోరుకొట్టుకుని అరిచినా అనుభవించే యోగ్యతలేని కొడుకువెధవకి తల్లిమాటలేవీ చెవికెక్కవి కావు. అట్టే కాపెట్టిఉన్న ఎవడో..." ఇలా మహానటుడు హరినారాయణ శ్లేషలో సంభాషణ నడుపుగొస్తుంటే అంతా నోరు తెరుచుకు వింటున్నారు.

ఇంతలో, "పక్కింటివాళ్ల కోడలు, ధనం లేచిపోయింది టండోయ్!" అంటూ— సినిమాపేర్లుచూసి 'చంద్రమ్మ' కాస్తా ఒత్తుతీసేసి 'చంద్రమ' గా పేరు మార్చుకున్న రుక్మిణి పాత్రధారిణి తీరిగ్గా చోద్యం చూసొచ్చినట్టు ప్రవేశించి రసాభాస చేసింది.

ఐనా, హరినారాయణ తట్టుకుని, ఇంతవరకు తను మాట్లాడుతున్న బిగిలోనే, "ఇంతకీ నేను చెప్పొచ్చింది కూడా అదే! ఒక్క విషయం ఆలోచించండి- నాకెక్కడన్నా మంచి ఆఫర్ వచ్చి... పోనీ, నేనిక్కడ పొందతగ్గ అదనపు సదుపాయాలేవీ లేన

ప్పాడు, నేనీ కంపెనీ పట్టుకు ఎందుకు వేళ్లాడాలి చెప్పండి" అన్నాడు.

కంపెనీ అభిమాని, హార్మోనిస్టు ఆదిశేషయ్యకీ ఉపమానం ఏమీ బాగా లేదు. ధనం లేచిపోవటానికి ఇది ఏవిధంగా ఉపమాన మౌతుందో అసలెవళ్లకీ అర్థం కాలేదు.

"ఇంతకీ ఎవళ్లు తన్నుకుపోయారో!" అన్నాడు తబలిస్టు నరసింహారావు డగ్గా పైమూత విప్పుతూ.

"ఇంత ఆహారం ఇక్కడుందని ఈ కృష్ణుడికి తెలియకనే పాయెనే!"-విచారపడ్డాడు గ్రద్దముక్కు-వెంకట్రామయ్య నెకిలిగా.

"ఏం? మన వెంకట్రావుకి దక్కివుండ కూడదూ? కొద్దిపాటిన ప్రయత్నించి ఎగిడి ఒళ్లో నన్నా పడటానికి సిద్ధంగా దొరముగ్గిన పండురా, అది ...పంజరంలో చిలుక" అన్నాడు హరినారాయణ ఇద్దరికీ సమాధానంగా.

విన్నవాళ్ళంతా ఒక్కసారి ఉక్కిరి బిక్కిరవూగు. హరినారాయణ తను కావాలనుకున్న విధంగా సంభాషణ నడుపుకొస్తున్నాడేమో—అతను చెపుతున్న విషయాలన్నిటికీ తేలికగా పొంతనకుదరక—అందులో వెంకట్రావు ధనాన్ని లేవదీసుకు పోయాడంటే అసలే నమ్మలేక పోయారు. చివరికి నారదమహాముని లాటివాడే—"ఏమైనా అభమూ, శుభమూ ఎరుగని అమాయకపు సన్యాసి... వెంకట్రావు మాత్రం చేసుంటాడీపని... నెయ్యలేడు కూడాను."

హరినారాయణ మళ్ళీ అందుకున్నాడు: "ఏం? అంత కనికరించావు వాణ్ణి? ఇవాళ్ళవాడు బాపట్ల పోవాలని, ఎందుకంటే చెప్పకండా రెండురోజులు ముందు నుంచీ మోగుతుంటే కూడా నీ దివ్యదృష్టి ఎక్కడ తగలడిందిరా నారదమహామునీ!" అంటూ వళ్ళిపోదాంపద మన్నట్టు తను బయలుదేరాడు. వెంకట్రామయ్య "ఇవాల్టి రిహార్సిల్సు సత్యభామ పాట్టని పెట్టుకుంది" అంటూ తలుపుతాళం వేశాడు.

"వెంకట్రావు బాపట్లపోయింది పెళ్ళిచూపుల కటట్టా! ఈ విషయాన్ని మనకి చెప్పటానికి సిగ్గుపడి ఉంటాడట్టా" అన్నారెవరో అక్కడికి. ఐనా, ధనాన్ని లేవతీసుకుపోయింది వెంకట్రావేనని తన ప్రచారంమాత్రం హరినారాయణ మానలేదు. నిజానికి, ఈ విషయాన్ని గట్టిగా ఎవడూ నమ్మనూలేదు.

ఐతే, మూడురోజుల తరవాత— ధనం బాపట్లలో ఉందిట — అనేవార్తని సత్యభామ పాత్రధారిణి కంపెనీ కొట్లోకి చేరవేసింది. దానితో ప్రతివాడూ కనుబొమల ఎగరవేశాడు. "దూరదూరంగా ఉండి ఉండి ధలేపని చేశాడే... మన్నందర్నీ వెక్కిరించినట్టు... ఓరి పిడుగా!" అన్నాడు తబలిస్టు డగ్గానొకసారి ధమ్మనిపిచ్చినట్టు.

హరినారాయణ సమయానుకూలంగా ఈవిషయాన్ని గురించి అసలుమాట్లాడటమే మానేశాడు. వెంకట్రావు ఊళ్ళోకి వచ్చాడని తెలియగానే పని వేళాపోయి "కంపెనీకొట్టు పక్కింటివాళ్ళ ధనాన్ని లేవదీసుకు పోయాడని మనవాళ్ళంతా అనుకుంటు న్నారు" అని కూడా చెప్పొచ్చాడు.

వెంకట్రావుకి అప్పుడే కాళ్ళనుంచి ఒణుకు ప్రారంభమైంది. ఇంట్లోనుంచి బయటికి రాకతీరదు. లోపలకూర్చుంటే లక్షఅనుమానాలు బయలుదేరుతై. హరినారాయణ ధర్మమాఅని, ఎవరుఎదురైనా వాడు వెయ్యబోయే ప్రశ్నలుకొంతవరకు తెలుస్తానే ఉన్నై గనక వాటికి తగ్గసమాధానాలు ఏమిటని తీవ్రంగా ఆలోచించటం మొదలు పెట్టాడు.

రెండురోజుల కెలాగో మనసు రాయిచేసుకుని బిక్కుబిక్కు మంటూ బైటి కొచ్చాడు కాని, ఆపూట వెంకట్రావు ఎవరి కాసు పరీక్షనూ ఎదుర్కోవలసిన అవసరం లేకపోయింది. మర్నాడుఉదయమే హార్మోనిస్టు ఆదిశేషయ్య వచ్చి మేలుకొలుపు పాడాడు పళ్ళుతోమించి కాఫీకికూడా లాక్కుపోతూడు. ఉండపట్టలేక దార్లోనే ప్రస్తావన ప్రారంభించాడు. "ఎప్పుడొచ్చావురా బాపట్లనించి?" అంటూ.

"మొన్న" అన్నాడు వెంకట్రావు నువ్వు అడగబోయేదంతా నాకు తెలుసు అన్నట్లు.

వెంకట్రావుచేత విషయమంతా ఎలా చెప్పించటమని ఆలోచిస్తూ ఆదిశేషయ్య కొంచెంసేపు తటపటాయించాడు.

ఇంతలో ఇద్దరూ హోటలు చేరుకున్నారు. కాఫీతాగుతున్న వెంకట్రామయ్య పొద్దుబాగా గడుస్తుందన్నట్టు తను కూర్చున్న మూలకు వీళ్లిద్దరినీ పిలిచాడు. "ఏరా, బాపట్లనించి ఎప్పుడొచ్చావ్ ప్రయాణం సవ్యంగానడిచి, వెళ్లినపని అయిందా ?" అన్నాడు.

"ఏం పని?" అన్నాడు వెంకట్రావు తీవ్రంగా.

"నువ్వు బాపట్ల ఏపనిమీద వెళ్లావో, ఆపని !" అన్నాడు ఆదిశేషయ్య. వెంకట్రామయ్య వైపొకసారిచూసి.

"ఏదో పెళ్లిసంబంధమొస్తే చూచిరావటానికి వెళ్లాను ; పిల్ల నాకు బాగుల్లేదు" అన్నాడు వెంకట్రావు గింజుకుంటున్నట్టు.

"ఎలా బాగుంటుందిలే. రాణిని వెతుక్కున్న కళ్లకి కాబోయే పెళ్లాన్ని చూస్తే మొత్తబుద్ధి వేసుంటుంది!" వెకిలిగా నవ్వాడు ఆదిశేషయ్య.

"ఏదో యవ్వన చాపల్యం, ప్రాణం పీకిఉండొచ్చు ... తప్పులేదు. మనలో మనకేమిటి చెప్పేయ్... ధనాన్ని ఇనప్పెట్టెలో పెట్టి తాళం వేసొచ్చావుగా?" అన్నాడు వెంకట్రామయ్య.

"ఇంకా ఎందుకురా, అలా పూసిపెడతావ్?" ఆదిశేషయ్య అందుకున్నాడు.

వెంకట్రావుకి కళ్లనీళ్ల పర్యంతమయింది. పెద్ద పోట్లాటకి దిగుతున్నంత రభసచెయ్యకండా ఉండలేక పోయాడు అమాయకుడు! వ్యవహారం శృతిమించి రాగానబడుతున్నదని ఆదిశేషయ్య భయపడి, "అసలీ గొడవంతా ముందు మాకు చెప్పింది, హరినారాయణ. ఇందులో పాపమెంతో పుణ్యమెంతో నీకు తెసియాలి; వాడికి తెలియాలి" అంటూ సర్దిచెప్పాడు.

హరినారాయణ ప్రవర్తన తల్చుకునేసరికి వెంకట్రావు కడుపు రగిలిపోయింది. కాని ప్రస్తుతానికి తను చేయగలిగిందేమీ లేదనుకుంటూ ఇల్లు చేరుకున్నాడు.

సాయంత్రం పార్కు‌లో హరినారాయణ కనిపించాడు. కాళ్ళూచేతులు బారజాపి శవాసనం వేసి గడ్డిమీద పడుకుని, కళ్లు మూసుకుని, ఊపిరి బిగపట్టి ఉన్నాడు వెంకట్రావు సమీపించేసరికి "ఇంకా ఎవడికొంప తియ్యటానికిరా ఈ కొంగజపాలు? నిన్ను తగలెయ్యా! ఇది నీకేం పొయ్యేకాలం!...." ఫెళఫెళా కసి తీరా నుక్కు అందినంతవరకు తిడుతూనే వున్నాడు వెంకట్రావు.

కొద్దిక్షణాల తరవాత అప్పుడే ధ్యానముద్ర వదిలినట్టు, ఈ ప్రపంచంలోకి వస్తున్నట్టు కళ్ళుతెరిచాడు హరినారాయణ. ఈ వెకిలి వేషాలు తనని మభ్యపెట్టలేవన్నట్టు సూటిగా, "ఆ అమ్మాయిని లేవదీసుకువెళ్ల గా నువ్వు చూశావా?" అన్నాడు వెంకట్రావు.

"తీసికెళ్ల లేదా?" అన్నాడు హరినారాయణ రెట్టిస్తూ.

"నే తీసికెళ్లానా?" అన్నాడు వెంకట్రావు.

"ఎందుకు తీసికెళ్లలా? నువ్వు తీసికెళ్లి ఉండాల్సింది. తీసికెళ్లకపోతే తీసికెళ్లు; తీసికెడితే చిక్కేలేదు..."

ఈ హరినారాయణ అడ్డగోలుధోరణి అంతం కాకుండాసాగిపోతుందని, "కొంచెంఒళ్లుదగ్గిరుంచుకుని మాట్లాడరా!" అన్నాడు వెంకట్రావు ఇప్పటికైనా హరినారాయణ్ణి తనురీతిని మందలిద్దామని.

హరినారాయణ విసుగ్గా, "ఎంతసేపని దగ్గిరుంచుకునేదిరా వెధవ వంటిని? కాస్సేపు నోటికివచ్చిందల్లా మాట్లాడనీ...స్కూలుపిల్లాడి కాంపోజిషన్లులాగా పూర్వాపరసంబంధాలు జ్ఞాపకముంచుకుంటూ మాట్లాడిమాట్లాడి తల చెడ్డది..." అంటూ సణగటం ప్రారంభించాడు.

"మరీఅంత అడ్డగోలువ్యవహారమైతే, నాకు నీ తల పగలగొట్టాలనుంది, కొట్టమంటావా?" అన్నాడు వెంకట్రావు కసిపట్టలేక.

"అది నీ చేతేమౌతుందిరా నాతండ్రీ!... తెగించి అంత చెడ్డపని నువ్వేం చెయ్యగలవురా... ధనానికింత దారిచూపావని పట్టెడు పెద్దరికం అంటగడితేనే ఇలా తబ్బిబ్బవుతుంటివి..."

హరినారాయణ్ణి ఏమనీ లాభంలేదని వెంకట్రావు కూర్చుని ధనాన్నిపట్టుకు చెడతిట్టటం ప్రారంభించాడు.

విని విని, చివరికి హరినారాయణ "ఎందుకలా ఆడిపోసుకుంటావు...కళ్లు పోతైరా... పెద్దవాళ్లని అన్నందుకు ఆపైన నాలిక కొరుక్కోవలసి రావచ్చును కూడా. కారణాంతరాలవల్ల బాపట్లలో ఒక చిన్న మకాంచేసి, మద్రాసుచేరి ధనమల్లా శ్రీలేఖగా మారి ఇప్పు డావిడ సినిమాల్లో నేరుగా హీరోయిన్నే అయికూర్చునేట్టుంది ... తమాయించుకో... నా మాటవిని తొందరపడకు. ఒకవ్యక్తిని అంతపైకి తీసికెళ్లాననిపించుకోవటంకంటె ఇంకేంకావాలిరా! మంచికాని, చెడుకాని ధైర్యంచేసి చేసి ఏపనీ చెయ్యలేని అర్భకుడివనీ, స్నేహితుడివికదా అనీ, ఈ ఖ్యాతిఅంతా నీకు ధారపోశాను..."

వెంకట్రావు అక్కడనుంచిలేచి వెళ్లిపోయాడు. తరవాత అసలు హరినారాయణ విషయమే వెంకట్రావుకి తెలీదు. మద్రాసులో వాడుకూడా ఉంటున్నాడని మాత్రం విన్నాడు. ఇప్పుడు తనుకూడా మద్రాసు రావటంతో తననింత రభసపెట్టటానికి వీలుగా హరినారాయణ శ్రీలేఖనిముందుగానే తయారుచేసి ఉంచాడని లోలోపల కుమిలిపోయాడు వెంకట్రావు.

శ్రీలేఖ, గతం మరిచిపోతగ్గదన్నట్టు ఒకనవ్వు నవ్వి, రిస్టువాచి చూస్తూ, "పాతపురాణమంతా తిరగేశాం...బుఱ్ఱ దిమ్మెక్కింది. పిక్చర్‌కిపోదాం రండి..." అంది కుర్చీలోనుంచిలేస్తూ.

వెంకట్రావు తననికాదన్నట్టు హరినారాయణ కోసం వెతుక్కోవటం మొదలుపెట్టాడు. బిక్కగా అటూ ఇటూ చూస్తూన్న వెంకట్రావుతో, "తల్లిచాటు పిల్లాడిలా అలా బెంబేలుపడతారేమండీ!... ఆయనలేందే మీరు రారేమిటి సినిమాకి?..." అంది కవ్విస్తున్నట్టు.

దార్లో మళ్లీ, "నేనే పరిస్థితుల్లో ఇల్లువదిలి వచ్చానో నిజంగా మీకు తెలీదు; మీకు తెలీకండా నే మీరు నన్నలా దూషించారని వినేసకి నిజంగా నేను మీతో లేచివస్తే చాలా బాగుండేదనిపించిందడీ.." అంది!

హరినారాయణకంటె శ్రీలేఖ రెండాకులు ఎక్కువే చదివిందనుకున్నాడు వెంకట్రావు. వీళ్లిద్దరూకలిసి తనపై పగతీర్చుకుంటున్నారేమోనని పించిందతనికి.

కేవలం అలా అని సినిమాలోకూర్చున్నంత సేపూ ముణగదీసుకు కూర్చున్నాడేకాని, ఆవిడలా కవ్విస్తూ మాట్లాడుతున్నప్పుడు "మీరింత పైకొచ్చారని చూశాక, మిమ్మల్ని ఇంటిదగ్గర కట్టిపడేస్తేనే బాగుండేదనిపిస్తోందండీ" అని కాని, అలాటి చమత్కారసంభాషణేమన్నా చేసివుంటే ఎంతబాగుండేది? ఊఁ...హు... అసలా ధోరణేలేదు వెట్టినాగన్నకి.

నిజంగా ఆవిడలో సమయస్ఫూర్తే ఉండివుంటే దానికి సమాధానంగా, "మీరుగనక తీసికెడతానంటే మళ్ళీ ఇంటికిపోదామని ఉందండీ" అనేదేమో!

అలా అనాలేగాని ఎంతచక్కటి సమాధానం చెప్పవచ్చు? అసలు సంభాషణ ఈ దారిపట్టందే! తనపుట్టిమునిగిపోయినట్టు ముణుచుకూర్చున్నాడు వెట్టి వెంకట్రావు.

దీనికి తగ్గట్టు శ్రీలేఖ ఎంతసేపూ హరినారాయణని పొగడటం మొదలుపెట్టింది. తను - ఊఁ-కొట్టక పోయినా ఆవిడచెపుతూనేవుంది—మనిషిలో దాగున్న శక్తిసామర్థ్యాల్ని నిరూపించుకోటానికితగ అవకాశం కల్పించగలవాడనీ ... సినిమానుంచి వస్తుంటె దారిపొడుగునా ఇదేసొద! ఈ చిలకపలుకులన్నీ హరినారాయణ నేర్పినవేమోననుకున్నాడు వెంకట్రావు.

తనెవ్వరికీ చెందని ఒంటరిగాణ్ణనిపించింది వెంకట్రావుకి. కారులోనుంచి వెట్టిగా రోడ్డుపక్కకి తొంగిచూడటం మొదలుపెట్టాడు.

"ఏం? ఇక్కడెక్కడన్నా దిగుతారా మీరు?" అంది శ్రీలేఖ.

వెంకట్రావు కొంచెం తడబడి, తెప్పరిల్లి, "కారాపండి ... హరినారాయణ రూంకి పోతాను." అన్నాడు.

తనతో కలిసివుంటున్న హరినారాయణకి వేరే బసంటూ లేదని తెలిసికూడా వెంకట్రావునలా నట్టేట వదిలేసిందంటే అతని మనస్తత్వాన్ని శ్రీలేఖ పూర్తిగా అపార్థంచేసుకుందనే చెప్పాలి.

ఎక్కడికిపోవాలో వెంకట్రావుకి గట్టిగా తెలీదు. ఇంతలో అదృష్టవశాత్తు హరినారాయణఎదురై "నీకోసమే వెతుక్కుంటూవస్తున్నా" అన్నాడు. ఎలాగో వీలుకల్పించుకుని, తను, శ్రీలేఖ కలిసి ఉంటున్నామని చెప్పి, దానితోబాటు, "కూడీకూడని ఆవిడ సంసారాన్ని కూలదోసి ఇంతివృద్ధిలోకి తెచ్చినందుకు నాకుదక్కిన పెద్దరికమి" దని తన సహజధోరణిలో అని ఆత్మసంతృప్తిపొందాడు.

తనతోకలిసి మేడలోకి రమ్మని హరినారాయణ ఎంతబతిమాలినా వెంకట్రావు రానన్నాడు. ఎక్కడికి వెడతావంటే మాట్లాడడు. చివరికి హరినారాయణ "దగ్గర్లోనే నా స్నేహితుడి గది ఒకటుంది ఈరాత్రికి అక్కడ నిద్రపో... తెల్లారి నేనొచ్చి కాఫీఉగ్గుపడతాను..." అన్నాడు.

"ఇక్కడెక్కడన్నా దిగుతారామీరు?" అని శ్రీలేఖ అడిగినప్పుడు దిక్కులేని పిల్లాడిలాగా "హరినారాయణ రూంకిపోతాను" అన్న వెంకట్రావు ఏమనగలడు...